ఈ వారం కథ

# గుండెల్లో ముల్లు

డి.వి.ఎస్.ఆర్. మూర్తి

'ఎవడో దొంగ వెధవ నా జేబు కొట్టేసాడు' అన్నాడు కృష్ణ అప్రయత్నంగా జేబు తడుముకుని.

అతడు బాపట్ల స్టేషనులో రైలు ఎక్కాడు. గుంటూరు వెళ్ళాలి. అక్కడ అతడి కుటుంబం వుంది. ఇంచుమించు ప్రతి వారం గుంటూరు వెళ్ళి వస్తూనే వుంటాడు. కాని ఎప్పుడూ ఇలా జరుగలేదు.

కృష్ణ డిప్యూటీ తహసిల్దారు. ఈనాడు లోకంలో అందరిలానే బ్రతుకుతెరువు తెలిసినవాడు. రెవిన్యూ డిపార్టుమెంటు అంటేనే రాజా డిపార్టుమెంటు. గుమాస్తాగా వుంటేనే చాలు. రెండు చేతులా డబ్బే. ఇక డిప్యూటీ తహసిల్దారు అంటే చెప్పనక్కర లేదు.

రైలు బాపట్లలో బయలుదేరడానికి సిద్ధంగా వుంది. అప్పుడు అతడు కూర్చున్న కంపార్టుమెంటులోకి ఒక పెద్దమనిషి కాలుపెట్టాడు. వెంటనే కృష్ణ దృష్టి అతడి మీద పడింది. కారణం అతడు మంచి టిప్‌టాప్‌గా వున్నాడు. వేసుకున్న బట్టలు ఖరీదైనవి. కాళ్ళకు నల్లని మెరసిపోతున్న జోళ్ళు. ఇ' షర్టు చేసుకున్నాడు. సరాసరి అతడు వచ్చి కృష్ణ ప్రక్కన కూర్చున్నాడు.

కృష్ణకు అతడిని పలుకరించి పరిచయం చేసుకోవాలనిపించింది. కాని ఆ పెద్దమనిషి చాలా ముభావంగా కనిపించాడు. దానితో కృష్ణ అతడితో మాట్లాడలేదు. అతడిని మరి పట్టించుకోలేదు.

అంతలోనే రైలు తెనాలి స్టేషములో ఆగింది. కృష్ణ స్టేషను బయటకు వచ్చాడు. బస్ స్టాండుకు బయలుదేరాడు. గుంటూరు బస్సులు రద్దీగా వున్నాయి. గుంపులో పడి తోసుకుంటూ బస్సు ఎక్కాడు కృష్ణ. టికెట్టు తీసుకుని వెళ్ళి ఒక సీటులో కూర్చున్నాడు.

కృష్ణ గుంటూరులో బస్సు దిగాడు. జేబు చూసుకున్నాడు. పై ప్రాణాలు పైకిపోయాయి. తన జేబు ఎవడో కొట్టేశాడు. అలా అని గట్టిగానే అరచాడు.



'మీ జేబే?' అన్నాడు ప్రక్కనే నిలబడిన వ్యక్తి.

కృష్ణ తల ఎత్తి అతడి వంక చూశాడు. అతడిని చూడగానే కృష్ణ సిగ్గుపడ్డాడు. అతడు బాపట్లలో రైలు ఎక్కి తన ప్రక్కన కూర్చున్న పెద్దమనిషి. అతడికి విషయం తెలిసిందన్న బాధ కృష్ణకు లేకపోలేదు. ఆ తికమక స్థితిలో 'ఔను. నా జేబే?' అన్నాడు.

'ఎంత డబ్బుంది?' ఆ పెద్దమనిషి ప్రశ్నలో సానుభూతి కనిపించింది.

'ఎంత డబ్బు అయితే ఏం చేస్తాం?' అన్నాడు కృష్ణ పరసులో వున్న డబ్బు ఎంతో చెప్పడం ఇష్టం లేక. పది వేలు పైనే వుంది. 'నా సంసారం ఈ నెల ఎలా గడుస్తుందో!' అతడు పోగొట్టుకున్నది నెల జీతం అన్నట్లు అతి దీనంగా ముఖం పెట్టాడు.

'ఈ నెల గడవడం అంత కష్టమా?'

'వేరే చెప్పాలా?' అన్నాడు కృష్ణ. 'ప్రభుత్వంలో నిజాయితీగా ఉద్యోగం చేసేవాడికి రెండు రోజులు జీతం రావడం ఆలస్యం అయితే వకవకలాడిపోతాడు. ఇక నెల జీతం పోగొట్టుకున్న నాలాంటి

వాడి సంగతి దేముడికే తెలుస్తుంది.'

'ఈ రోజుల్లో ప్రభుత్వ ఉద్యోగులు నిజాయితీగా వుంటున్నారా?' అన్నాడు ఆ పెద్దమనిషి వ్యంగ్యంగా. 'ఆఫీసుకు వెళ్ళినందుకు జీతం, పని చేసినందుకు లంచం'.

'ఇంకా నాలాంటి వాళ్ళు వుంటారంటే నమ్ముతారా?' కృష్ణ మాటల్లో విసుగు వుంది. అంత డబ్బు పోయిందన్న బాధ. ఆ పెద్దమనిషిని తప్పించుకుని నాలుగు అడుగులు ముందుకు వేశాడు కృష్ణ.

'ఆగండి' అన్న ఆ పెద్దమనిషి పిలుపుతో వెనక్కు తిరిగాడు కృష్ణ.

'ఎందుకు పిలిచారు?' చికాకుగానే అన్నాడు కృష్ణ.

'ఇదేనా మీ పరసు' అంటూ ఆ పెద్దమనిషి ఒక పరసు కృష్ణ చేతిలో పెట్టాడు.

కృష్ణ తన కళ్ళను తాను నమ్మలేకపోయాడు. పోగొట్టుకున్నది తిరిగి రావడం కల్ల. 'ఇది నాదే' అన్నాడు ఆశ్చర్యంతో.

'అయితే మీ డబ్బు అంతా వుందో లేదో చూసుకోండి.'

'థాంక్స్' అన్నాడు కృష్ణ పరసులో డబ్బు చూసుకుని, అతడి ముందు లెక్క పెట్టడం ఇష్టంలేక. 'మీరు నన్ను రక్షించారు. మీరు ఎవరో తెలుసుకోవచ్చా?'

'వద్దు' అంటూ ఆ పెద్దమనిషి చకచకా నడచి అక్కడ నుంచి వెళ్ళిపోయాడు.

కృష్ణ బొమ్మలా అతడికేసి చూస్తూ నిలబడ్డాడు. జరిగిందంతా ఒక కలలా వుంది.

ఆ పెద్దమనిషి ఎవరో చెప్పకుండా వెళ్ళిపోయాడన్న బాధ కృష్ణకు మిగిలింది. అతడి చేతికి తన పరసు ఎలా వచ్చింది అన్నది ఆశ్చర్యంగా వుంది. ఆ పెద్దమనిషి జేబుదొంగా అన్న అనుమానం వచ్చింది.

ఒక్క క్షణంలో ఆ అనుమానం మాయమయింది. దొంగిలించింది ఏ దొంగా తిరిగి ఇవ్వడు.

* * *



●● అతడి చేతికి తన పర్సు ఎలా వచ్చింది? అన్నది ఆశ్చర్యంగా వుంది కృష్ణకు. ఆ పెద్దమనిషి జేబుదొంగా? అన్న అనుమానం కూడా వచ్చింది. ●●

కృష్ణ పని మీద స్టూవర్టుపురం వెళ్ళాడు. అది గజదొంగల పునరావాస పురం.

అతడు అక్కడకు వెళ్తూ వుండగానే ఏవేవో జ్ఞాపకాలు గుర్తుకు వచ్చాయి. ఆ ఊరు అక్కడ చుట్టుప్రక్కల గ్రామాలలో పేరుమోసింది.

స్టూవర్టుపురం వాడు అంటేనే చుట్టుప్రక్కల అందరికీ నిద్ర పట్టదు. అక్కడ ఆ పునరావాస పురం ఏర్పాటుచేసి అక్కడ ప్రాంతాల వాళ్ళందరికీ ఏదో ద్రోహం ప్రభుత్వం చేసిందని వాళ్ళ ఆరోపణ.

కృష్ణకు అప్పుడు రాష్ట్రాన్ని కలతపెట్టిన సంఘటన గుర్తుకు వచ్చింది. అది సింహాచలం గుడి దోపిడి. ఆ దోపిడి మామూలు దొంగలకు సాధ్యం కాదు. దానిని చేసింది స్టూవర్టుపురం గజదొంగలని తేలింది.

అలాంటి స్టూవర్టుపురం వెళ్ళడం కృష్ణకు ఒక థ్రిల్ అనిపించింది. అక్కడ దొంగలను కలుసుకోవడం ఒక అనుభవం. వాళ్ళతో మాట్లాడి అసలు వాళ్ళు ఏమిటో తెలుసుకునే అవకాశం అతడికి వచ్చిందన్న ఆనందం అతడికి లేకపోలేదు.

అక్కడ కొందరు ఇళ్ళ స్థలాలకు దరఖాస్తు పెట్టుకున్నారు. వాటిని పరిశీలించి వాళ్ళు ఇళ్ళు కట్టుకోవడానికి అనుమతి ఇవ్వవచ్చునో లేదో అతడు రిపోర్టు వ్రాయాలి. అతడి రిపోర్టు మీదే వాళ్ళ అదృష్టం ఆధారపడి వుంది.

ఆ రిపోర్టు వ్రాయడానికి తగిన ప్రతిఫలం అతడికి వుండాలి అప్పుడే ఇళ్ళ స్థలాలుగా ఇవ్వవచ్చని వ్రాస్తాడు.

ఆ విషయం అప్పుడే అక్కడ ఆ స్థలాలకు దరఖాస్తు పెట్టిన వాళ్ళకు కబురుచేయడం జరిగింది. కృష్ణకు ఆ సందర్భంగా ఎంత ముట్టచెప్పాలో నిర్ణయం కూడా అయింది.

అతడి వాటా ఇరవై వేలు. ఆ సొమ్ము అతడికి అక్కడ ముట్టచెప్పాలి. అన్ని ఏర్పాట్లు జరిగాయి.

కృష్ణ అక్కడకు చేరేసరికి రెవిన్యూ ఇన్‌స్పెక్టరు అతడి బలగంతో ఎదురు చూస్తున్నాడు. అందరూ కలసి విచారణ జరుపవలసిన ప్రదేశం చేరారు.

అప్పటికే అక్కడ జనం చాలా మంది చేరారు. అందరూ నిలబడి కృష్ణకు నమస్కారం చేశారు.

కృష్ణ అందరితోను కలసి ఆ ప్రదేశం అంతా తిరిగి చూశాడు. తన సిబ్బందిని కొన్ని ప్రశ్నలు వేశాడు. అదంతా ఒక తతంగం అని అక్కడ అందరకూ తెలుసు. కృష్ణకూ తెలుసు.

తరువాత అందరూ కలసి తిరుగుముఖం పట్టారు. ఒక ఇంటికి వెళ్ళారు. అప్పటికే అక్కడ ఒక బల్ల. దాని ముందు ఒక చేతుల కుర్చీ. దానికి ఎదురుగా ఇరువైపులా ఇనుప కుర్చీలు. వాటి మీద కొందరు కూర్చున్నారు. కృష్ణను చూసి అందరూ లేచారు. అతడికి బల్ల వెనుక కుర్చీ చూపించారు. అతడు వెళ్ళి కూర్చున్నాడు.

'మీరు?' అన్నాడు కృష్ణ తన కళ్ళను తాను నమ్మలేకుండా.

'నేనే!' అన్నాడు గంభీరంగా.

'గంగరాజు! మా అందరికీ పెద్ద' అంటూ ఒక వ్యక్తి గంగరాజును కృష్ణకు పరిచయం చేశాడు.

'మనం తిరిగి కలుసుకుంటామని నేను అనుకోలేదు' అన్నాడు కృష్ణ.

'ఎప్పుడు ఎక్కడ ఎవరు ఎవరికి ఎందుకు తారసపడతారో మనం చెప్పలేము' గంగరాజు మాటల్లో కూడా వేదాంతిలా వున్నాడు.

'అది నిజమే' అన్నాడు కృష్ణ అయోమయంగా.

'ఇప్పుడు ఆ విషయం ఎందుకులెండి' అన్నాడు గంగరాజు గతాన్ని గతంగానే వుంచడానికి. 'ప్రస్తుత విషయానికి వద్దామా?'

'మీ పని అయినట్లే' అన్నాడు

క్రిష్ణ. 'మీకు ఇళ్ళస్థలాలు ఇవ్వవచ్చు నని ఈ రోజే రిపోర్టు వ్రాస్తాను. తొందరలో మీకు పర్మిషను వచ్చేలా చేస్తాను.'

'మీకు కృతజ్ఞతలు' అంటూ గంగరాజు లేచాడు. 'మీకు మేము ముట్టచెప్పవలసింది' అంటూ ఒక కవరు బల్ల మీద పెట్టాడు.

క్రిష్ణకు వెంటనే గుంటూరు బస్‌స్టాండు గుర్తుకువచ్చింది. ఈ గంగరాజు స్టూవర్టుపురం గజదొంగ, మామూలు దొంగ కాదు.

అతడు తన పరసు కొట్టేసాడ అన్న అనుమానం వచ్చింది. అందుకే అతడు తనను వెంబడించాడా? గుంటూరుదాకా వచ్చాడా? ఈ ప్రశ్నలకు వెంటనే అతడికి సమాధానం రాలేదు.

కాని తన పరసు పోయినప్పుడు గంగరాజు తన వెంట వున్నాడు. తిరిగి తన పరసు తనకు ఇచ్చిందీ గంగరాజే. తన కృతజ్ఞత కూడా అందుకోకుండా ఏదో మంచి పని చేసినట్లు వెళ్ళాడు. అంతా తికమకగా వుంది క్రిష్ణకు.



మేము దొంగతనం చేసి బ్రతకాలి. తప్పదు. కాని అందులోనూ మాకు నీతి నియమాలున్నాయి. లేనివాడి జోలికి పోము. ఆ రోజున మీ జేబులో నుంచి ఆ పరుసు కొట్టేసింది మేమే.

ఒక దొంగ మానవత్వం వుట్టిపడే పని చేశాడా? మానవత్వం చూపించవలసిన వాళ్ళు దొంగలలా ప్రవర్తిస్తున్నారా? ఈ ప్రశ్నలు క్రిష్ణకు ఎదురయ్యాయి.

గంగరాజు అతడి ముందుంచిన కవరు అతడిని చూసి నవ్వినట్లయింది. ఏదో తన మనస్సు దొంగలా గంగరాజు ముందు నిలబడినట్లుంది. తాను అశోక వనంలో హనుమంతుని ముందు అక్షయకుమారిడిలా వున్నాడు.

'దొంగిలించబడిన నా పరసు మీరు తిరిగి ఇచ్చారు ఆ రోజు గుంటూరు బస్సు స్టాండులో మీరు ఆనాడు చేసిన ఉపకారానికి ఈనాడు నాకు ప్రత్యుపకారం చేయడానికి అవకాశం వచ్చింది' క్రిష్ణకు ఏదో కొత్త వెలుగు కనిపించింది.

'నేను ఉపకారం చేయలేదు. ఆ పరసు మీ జేబులోంచి కొట్టేసింది నేనే!' ఏమీ సిగ్గుపడకుండా చెప్పాడు గంగరాజు.

'మాకు దొంగలని ముద్ర వేశారు' అన్నాడు ప్రక్కనున్న వ్యక్తి. 'మేము దొంగతనం చేసి బ్రతకాలి. తప్పదు. కాని అందులోనూ మాకు నీతినియమాలు వున్నాయి. లేనివాడి జోలికి పోము'.

'గంగరాజుని చూసి నేను నేర్చుకోవలసింది ఎంతో వుంది' అన్నాడు క్రిష్ణ. 'ఆ పరసులో వున్నది నా నెల జీతం కాదు!'

'కాదా!' ఆశ్చర్యం వెలిబుచ్చాడు.


'ఇప్పుడు మీరు ఈ కవరు ఇచ్చినట్లే బాపట్లలో ఒక పార్టీ ఇచ్చిన కవరు ఆ పరసులో వుంది.'

'అలాగా!' అన్నాడు గంగరాజు. 'అయినా ఫరవాలేదు. ఆ కవరు తీసుకోండి!'

'వద్దు' అంటూ లేచాడు క్రిష్ణ.

క్రిష్ణ గుండెల్లో ముల్లు గుచ్చుకుంది. ♦


" నా కుటుంబానికి 'ట్వీన్‌ప్లస్' లక్షణాలు కల సాధనంతో నిరపాయకరమైన పరిశుభ్రమైన త్రాగునీటిని అందిస్తాను."




తక్కువ సమయంలో ఎక్కువ నీటిని వడపోసి శుభ్రపరచే ద్విపాత్ర పోషణ చేయగల సాటిలేని ఏకైక క్యాండిల్

★ మేలురకం సిరమిక్‌తో తయారై ఎక్కువ కాలం వచ్చేందుకు దృఢంగా తయారైనది.

★ ఏ మోడల్‌లోగాని, ఏ సైజులోగాని చక్కగా అమర్చుకోవచ్చును.

★ నీటిలో స్థానం చేసుకొనె హానికరములను, ఇబ్బందికరమైన వాసన మరియు రంగు మార్పిడి మొదలగు వాటిని క్యాండిల్‌లోని యాక్టివేటెడ్ కార్బన్ గ్రాన్యూల్స్ తొలగిస్తాయి.



వెల రూ. 45/-

ఒరిజినల్ రామావాటర్ ఫిల్టర్ క్యాండిల్ మరీ అడిగి కొనండి.

ఆంధ్రప్రదేశ్‌లో మార్కెట్ చేయువారు.

RAMA®

స్టెయిన్‌లెస్ స్టీల్ వాటర్ ఫిల్టర్

Mahavir Enterprises (India) Pvt. Ltd.

హైదరాబాద్-500 001. ఫోన్: 231198, 231747

ULKA-50213

అన్ని రామా వాటర్ ఫిల్టర్ డీలర్ల వద్ద లభించును